


ప్రజాశక్తి

మంగళవారం 25 జూన్ 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

తొలగింపా? కొనసాగింపా?



- దోలాయనంలో వాలంటీర్లు
- పించన్ల పంపిణీ నుంచి తప్పించిన ప్రభుత్వం
- 15,922 మంది సేవలకు పొంచి ఉన్న ముప్పు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పనిచేసే వాలంటీర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. టిడిపి ప్రభుత్వం తమను కొనసాగిస్తుందో? తొలగిస్తుందో? తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. వైసిపి ప్రభుత్వం తెచ్చిన వాలంటీర్ల వ్యవస్థలో సమూల మార్పులు చేయాలని యోచిస్తున్న టిడిపి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించలేదు. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో జులై ఒకటి నుంచి ఇచ్చే సామాజిక పింఛన్లను వాలంటీర్ల ద్వారా కాకుండా సచివాలయం ఉద్యోగుల ద్వారా ఇంటింటికి వెళ్లి ఇవ్వాలని నిర్దేశించారు. దీంతో వాలంటీర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

వాలంటీర్లకు గత ప్రభుత్వం రూ.5 వేలు గౌరవ వేతనం ఇవ్వగా వీరికి రూ.10 వేలు వేతనం ఇస్తామని సిఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రస్తుతం 15,922 మంది వాలంటీర్లు ఉన్నారు. వీరుకాక ఎన్నికల ముందు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 5883 మంది రాజీనామా చేశారు. వీరి స్థానంలో మూడు నెలలుగా ఎవర్నీ నియమించలేదు. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాజీనామా చేసిన వారు కోరినా ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదు. ఈ నేపథ్యంలో విధుల్లో ఉన్న వారినీ కొనసాగిస్తారా? లేదా? అనే అంశంపై అయోమయం నెలకొంది.

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో గుంటూరు జిల్లాలో 7810 మంది, పల్నాడు జిల్లాలో 8112 మంది వాలంటీర్లు విధుల్లో ఉన్నా వీరికి గత పక్షం రోజులుగా ఎటువంటి విధులూ అప్పగించడం లేదు. జూన్ నెల జీతం మాత్రం ఇచ్చారు. జులై జీతం వస్తుందో రాదో స్పష్టత లేదు. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటన్నదీ అంతుబట్టడం లేదని గుంటూరుకు చెందిన పలువురు వాలంటీర్లువాపోయారు.

వాలంటీర్లంతా తమపార్టీ కార్యకర్తలేనని వైసిపి ప్రజా ప్రతినిధులు గతంలో పదేపదే బహిరంగంగా ప్రకటించిన నేపథ్యంలో టిడిపి ప్రభుత్వం వీరిని ఎలా కొనసాగిస్తుందని ఆపార్టీ నాయకులు కూడా నర్మగర్భంగా వ్యాఖ్యానిస్తున్నారు. వయస్సు, విద్యార్హతలు మార్పుచేసి కొత్తవారిని ఎంపిక చేసి ప్రస్తుతం ఉన్నవారిని దశల వారీగా మారుస్తారని ప్రచారమవుతోంది. ఒక దశలో వాలంటీర్లు అవసరమా అనే చర్చకూడా టిడిపి మంత్రుల్లో జరుగుతోందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. 2019లో వైసిపి నాయకుల సిఫార్సులతో ఎంపిక చేసినా ఆ తరువాత చాలా మంది స్వతంత్రంగానే ఇంటర్వ్యూలకు హాజరై వాలంటీర్లుగా ఎంపికయ్యారని అధికార వర్గాలు తెలిపాయి. తక్కువ వేతనంతో ఎక్కువ బాధ్యతలు నిర్వహించినా గత ప్రభుత్వం వీరికి భవిష్యత్తుపై తగిన భరోసా ఇవ్వలేదు. అంతేగాక ఎన్నికల ముందు రాజకీయ అవసరాల కోసం రెండు జిల్లాల పరిధిలో 5883 మంది చేత రాజీనామాలు చేయించారు. ఇప్పుడు వారంతా ఆశలు వదులుకున్నారు. అయితే ఉన్నవారినే కొనసాగిస్తారో లేదో తెలియదు కానీ రాజీనామా చేసిన వారిని ఇక ఎలా తీసుకుంటారనే భావనతో చాలా మంది ప్రభుత్వం నిర్ణయం కోసం ఎదురు చూడకుండా ఇతర ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు

సిఎం చంద్రబాబు వద్దకు పల్నాడు ఎమ్మెల్యేలు

- జిల్లా అభివృద్ధికి సహకరించాలని, కీలక ప్రాజెక్టులు పూర్తి చేయాలని విజ్ఞప్తి
- అనంతరం డీజీపీ వద్దకు - అరాచకాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని విన్నపం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అన్ని విధాలా వెనుబడిన పల్నాడు జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు కోరారు. సచివాలయంలోని ఒకటో బ్లాకులో సిఎం చంద్రబాబును పల్నాడు జిల్లా ఎమ్మెల్యేల్లో కన్నా లక్ష్మీనారాయణ మినహా పత్తిపాటి పుల్లారావు, జీవీ ఆంజనేయులు, యరపతినేని శ్రీనివాసరావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, భాష్యం ప్రవీణ్ సోమవారం కలిశారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితులు, చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను చెప్పారు. ఎన్నడూ లేని విధంగా పల్నాడు జిల్లాలో పార్లమెంట్ స్థానంతో పాటు మొత్తం 7 నియోజకవర్గాల్లో ప్రజలు టిడిపిని గెలిపించారని, వారి విశ్వాసం మేరకు పల్నాడు అభివృద్ధికి సహకరించాలని కోరారు. పల్నాడు జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం ద్వారా పల్నాడు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కీలకమైన వాటర్ గ్రిడ్, వరికెపూడిసెల ప్రాజెక్టులను పూర్తి చేయాలని విన్నవించారు. రాజకీయ కక్షలు, హత్యలకు ▶ 2లో

రైతుల వద్ద రూ.24 లక్షల మోసం

పల్నాడు ఎస్పీని ఆశ్రయించిన బాధితులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'మీకోసం' గ్రీవెన్స్‌లో ప్రజల నుండి ఫిర్యాదులను పల్నాడు జిల్లా ఎస్పీ మలిక గర్గ్ స్వీకరించారు. కుటుంబ, ఆస్తి, ఆర్థిక వివాదాలు, ఇతర సమస్యలపై 31 ఫిర్యాదులు అందాయని ఎస్పీ కార్యాలయం తెలిపింది. ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యమిచ్చి త్వరితగతిన పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ ▶ 2లో



సమస్యలు వింటున్న పల్నాడు ఎస్పీ




ఎంపీలుగా

చంద్రశేఖర్, కృష్ణదేవరాయలు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, నర్సరావుపేట లోక్‌సభ సభ్యులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, లావు శ్రీకృష్ణదేవరాయులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరిద్దరూ తెలుగులోనే ప్రమాణం చేశారు. లోక్‌సభ తొలి సమావేశం సోమవారం ప్రారం భం కాగా సభ్యులతో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్ ప్రమాణస్వీకారం చేయించారు. గుంటూరు నుంచి 3.44 లక్షల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందిన పెమ్మసాని చంద్రశేఖర్ ఇటీవల కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తొలిసారిగా లోక్‌సభలోకి అడుగుపెట్టిన చంద్రశేఖర్ తొలుత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, భర్తృహరి మెహతాబ్‌కు అభివాదం చేశారు. తనకు ఎంపీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, భారీ మెజారిటీతో గెలిపించిన గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నరసరావుపేట నుంచి రెండోసారి ▶ 2లో

ఉపాధ్యాయినిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

పల్నాడు జిల్లా కలెక్టర్‌కు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, విజయసారధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో భాగంగా రెంటచింతల మండలం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఏపీవోగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయిని షేక్ షేహనాజ్ బేగంపై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేయాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి కోరారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీ కేశ్ బి లత్కర్‌ను సోమవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎంల ధ్వంసం ఘటన నేపథ్యంలో విధుల్లో ఉన్న పీఓ, ఏపీఓలను ▶ 2లో



ఉద్యోగులుగా ప్రజల కోసం పని చేయాలి

వీడ్కోలు సభలో ఎం.వేణుగోపాల్‌రెడ్డి

ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం

ప్రజాశక్తి - గుంటూరు

ప్రభుత్వ ఉద్యోగులుగా మనకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కషి చేయాలని బదిలీపై వెళుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో బదిలీపై వెళుతున్న వేణుగోపాల్‌రెడ్డికి ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ అద్దంకి శ్రీదర్, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకర్, డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ) కె.స్వాతి, ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సత్ఫలితాలు అందించేలా సక్రమంగా అమలు చేసేందుకు జిల్లా, రెవెన్యూ, మండల, గ్రామ స్థాయి వరకు ఉన్న అధికారులు, ఉద్యోగులు పూర్తి సహకారం అందించారన్నారు. పోలీస్, రెవెన్యూ నగరపాలక సంస్థ, ఇంజనీరింగ్, వ్యవసాయం, విద్యాశాఖ, వైద్యారోగ్య తదితర శాఖలలోని కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించిన అధికారులకు ధన్యవాదాలు చెప్పారు. నూతనంగా వచ్చిన ఉద్యోగులు విధుల్లో ప్రతిభ కనపర్చేందుకు కెపాసిటీ బిల్డింగ్ శిక్షణలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి, ఆరోగ్యం కోసం అవసరమైన కార్యక్రమాలను జిల్లాలో కొనసాగించాలన్నారు. టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ అద్దంకి శ్రీధర్ మాట్లాడుతూ పరిపాలనలో సౌమ్యమైన నాయకత్వ లక్షణాలున్న వ్యక్తి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. జెసి మాట్లాడుతూ అధికారులకు పూర్తి స్థాయిలో నైతిక మద్దతునిచ్చారని చెప్పారు. కార్యక్రమాల నిర్వహణకు టీం వర్క్‌తో పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళతారాన్నారు. ఎన్నికలప్పుడు సైతం స్వయంగా వచ్చి మనోధైర్యం ఇచ్చి సహకారం అందించారన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ నగరపాలక సంస్థ అభివద్ధి కార్యక్రమాలు, సార్వత్రిక ఎన్నికల సమయంలోను పాటు జిల్లా కలెక్టర్ గా వేణుగోపాల్ రెడ్డి నిరంతరం అండగా ఉన్నారన్నారు. అనంతరం బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లా అనంతరం కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, జిల్లా విద్యాశాఖ అధికారి శైలజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మీ, ఎల్డీఎం మహిపాల్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, పంచాయితీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కిరణ్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జిల్లా ట్రెజరీ శాఖ ఉప సం చాల కులు రాజగోపాల్, జిల్లా సమాచాం.పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు అబ్దుల్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

పిఎఎస్ కళాశాలకు లక్ష విరాళం

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్



పెదనందిపాడు కళాశాలలో 1995 -98 లో ఎంసీఏ పూర్తి చేసిన పూర్వపు విద్యార్థి.నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామానికి చెందిన కుర్రా వెంకట శివ రామకృష్ణ, యుఎస్ఎ లోని కాలిఫోర్నియాలో విజడం సాఫ్ట్ ఇంచార్జి వ్యవస్థాప కులుగా, సెయింట్ మార్టినస్ యూనివర్సిటీ (కురాకో) కు బోర్డు మెంబెర్ గా పనిచేస్తున్నారు. ఇండియా వచ్చిన సందర్భంగా సోమవారం పెదనందిపాడు కళాశాల కు విచ్చేసి కళాశాలలో తాను చదువుకున్న క్లాస్ రూమ్స్, లైబ్రరీ,లాబ్స్ ను సందర్శించి తన సంతోషం వ్యక్తం చేశారు.

ఆశాల న్యాయమైన కోర్కెలను అమలు చేయండి

ప్రజాశక్తి-నాదెండ్ల

ఆశా వర్కర్ల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం.. కనీసం శ్రమకు తగ్గ జీతం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయ నాయక్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం నాదెండ్లలో ఆశ వర్కర్ల యూనియన్ రత్న కుమారి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

నాదెండ్ల మండ లంలో పనిచేస్తున్న ఆశ వర్కర్లు అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ,ప్రస్తుత ప్రభుత్వం అయినా వారి న్యాయమైన కోరికలను తీర్చాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఆశ వర్కర్ల నాయకురాలు శివకుమారి,ఐద్వా నాయకురాలు చాగంటి అమరమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయ నాయక్ , చిత్రంలో శివకుమారి, అమరమ్మ

మంత్రి లోకేష్ ను కలిసిన గోనుగుంట్ల కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రాష్ట్ర మానవవనరుల, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రిగా భాధ్యతలు చేపట్టిన నారా లోకేష్‌ను మంత్రి చాంబర్‌లో రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు వైసిపిపై కోటేశ్వరరావు చేసిన పోరాటాన్ని లోకేష్ అభినందించి సత్కరించారు.

నారా లోకేష్‌ను కలిసిన రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి

ప్రజాశక్తి-తెనాలిరూరల్



లోకేష్ కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రణీత్

ఐటీ, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నారా లోకేష్‌ను రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి పాలడుగు ప్రణీత్ సెక్రటేరియట్ తన పేషీ లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేఖరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కళాశాలల్లో, విశ్వ విద్యాలయాల్లో విద్యార్థులు గంజాయికి బానిసలయ్యారని, గాడి తప్పిన విద్యా వ్యవస్థను సన్మార్గంలో నడిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. విద్యాశాఖాలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి నాణ్యత ప్రమాణాలు పెంచి దేశంలోనే రాష్ట్ర విద్యా వ్యవస్తను అగ్రగామిగా నిలబెడతారన్న నమ్మకం ఆయనపై ఉందన్నారు.

బావను మోసగించే యత్నం

ప్రజాశక్తి-తాడేపల్లి



సహజంగా బావమరుదులు బావ మేలు కోరతారంటారు. ఈ కేసులో బావను మోసం చేయబోయి బావమరిది పోలీసులు అడ్డంగా దొరికిపోయాడు. రూ.1.50 కోట్లు ఎగ్గొట్టడానికి వేసిన స్కెచ్ విఫలమైంది. దీనికి సంబంధించిన వివరాలు తాడేపల్లి సిఐ కల్యాణరాజు సోమ వారం విలేకరులకు తెలిపారు. మంగళగిరిలో నివాసం ఉంటున్న పసుపులేటి వీరాంజనేయులు దగ్గర తన బావమరిది గుర్రంకొండ రాము వ్యాపార అవసరాల నిమిత్తం పలు దఫా లుగా రూ.90 లక్షలు అప్పు చేశాడు. తిరిగి అప్పు చెల్లించాలని వీరాంజనేయులు ఎప్పుడు అడిగినా అతను కాలయాపన చేస్తున్నాడు. వారం రోజుల క్రితం ఈ విషయమై గట్టిగా నిలదీయడంతో హైదరాబాద్ నుంచి కిలోన్నర బంగారం తెస్తున్నానని, బాకీ మొత్తం చెల్లు చేసుకోమని నమ్మబలికాడు. గత రాత్రి దొంగ బంగారం బిస్కెట్లతో హైదరాబాద్ నుంచి విజయవాడ ఆర్‌టిసి బస్టాండ్‌కు చేరుకున్నాడు. వీరాంజనేయులను బైక్ వేసుకుని బస్టాండ్‌కు రమ్మని కబురు చేశాడు. ఇద్దరు కలిసి మంగళగిరి హైవేపై వెళ్తున్నారు. ముందుగా సెట్ చేసుకున్న ప్లాన్ ప్రకారం మంగళగిరికి చెం దిన రత్న, బబ్లు, మహబూబ్ బాషాలతో పాటు గుంటూరుకు చెందిన మరో ముగ్గురిని తమ వెనుక బైక్‌లపై వెంబడిస్తున్నట్లు రమ్మని చెప్పిన ప్లాన్ ప్రకారం వారు వెళ్లారు. కొలకునొండ మోడల్ డెయిరీ దాటిన తరువాత వీరాంజనేయులు, రాము ఉన్న బైక్‌పై రాము చేతిలోని నకిలీ బంగారు బిస్కెట్లు ఉన్న బ్యాగ్‌ను దొం గిలించి వారు పరారయ్యారు. రాము, వీరాంజనేయులు బండి మీద నుంచి కిందపడ్డారు. మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కోటిన్నర విలువ చేసే బం గారం పోయిందనే బాధ బావమరిదిలో కానరాకపోవడంతో వీరాంజనేయులు జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేశాడు. దీనిపై వెంటనే మంగళగిరి స్పెషల్ డిస్‌పి ఆధ్వర్యంలో తాడేపల్లి సిఐ కల్యాణరాజు, ఎస్ఐ ప్రతాప్ దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. రంగంలోకి దిగిన పోలీసులు రాముని తమదైన శైలిలో విచారించారు. ప్లాన్ బెడిసి కొట్టడంతో రాముతో పాటు సహకరించిన మంగళగిరికి చెందిన ముగ్గురిని సోమవారం అరెస్టు చేశారు. నకిలీ బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరుకు చెందిన నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలో అరెస్టు చేస్తామని సిఐ తెలిపారు.

రైతుల వద్ద రూ.24 లక్షల మోసం

(మొదటి పేజీ తరువాయి)

వహించి నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషి చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.

గ్రంథసిరి రైతుల ఫిర్యాదు

గుంటూరు జిల్లా ఏటుకూరుకు చెందిన మిర్చి వ్యాపారి లక్కిశెట్టి రవికుమార్ అనే వ్యాపారికి మిర్చి ఇప్పించిన మధ్యవర్తులు కె.నాగేశ్వరరావు, ఆనంగి సాంబయ్య ద్వారా తమకు రావాల్సిన రూ.24 లక్షలను ఇప్పించాలని అచ్చంపేట మండలం గ్రంథసిరికి చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేయగా నకిలీ బ్యాంక్ రసీదు ఇచ్చి మరోసారి మోసం చేశారన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటల సాగుకు పెట్టుబడి అవసరమని, మిర్చి డబ్బులు ఇవ్వాలని వేసుకున్నా ఇవ్వకుండా దుర్భాషలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పంచాయతీ కార్యదర్శి అత్యాచారయత్నం

మాచర్ల పట్టణానికి చెందిన నంద్యాల కోమలిపై ఇంటి పక్కన నివాసం ఉండే రెంటచింతల మండలం గోలి పంచాయతీ కార్యదర్శి అయిన కేలం సుబ్బారావు గతేడాది అత్యాచారయత్నం చేశారని బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారు. దీనిపై మాచర్ల పట్టణ పోలీసుస్టేషన్‌లో గతంలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదని చెప్పారు. దీంతో సుబ్బారావు దురుసుగా ప్రవర్తిస్తూ దూషిస్తున్నారని, గతంలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అతనిపై చర్యలు తీసుకోలేదని వివరించారు. అతనని వేధింపులు ఎక్కువయ్యాయని, ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు.

పైరును పీకేశారు

తమ పొలంలో పంటను పీకేశారని క్రోసూరు మండలం పీసపాడు గ్రామానికి చెందిన కంచేటి నరసయ్య ఫిర్యాదు చేశారు. తన తండ్రి దేవేంద్రరరావు 2.28 ఎకరాలను కొనుగోలు చేసి తన పేరు మీద రాశారని, ఆ భూమి విషయమై వివాదం వచ్చి కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇవ్వగా ఆ భూమిని వేరే వారికి కౌలుకు ఇచ్చామని చెప్పారు. అదే గ్రామానికి చెందిన కంచేటి సీతారామయ్య, నరసింహారావు, రామకృష్ణారావు, శ్రీనివాసరావు కలిసి పొలంలో పైరును ధ్వంసం చేశారని చెప్పారు. దీనిపై క్రోసూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు.

సిఎం చంద్రబాబు వద్దకు పల్నాడు ఎమ్మెల్యేలు

(మొదటి పేజీ తరువాయి)

తావు లేని జిల్లాను చూపిస్తామని, ప్రశాంతమైన వాతావరణంలో పాలన సాగిస్తామని చెప్పారు. అనంతరం డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పోలింగ్ అనంతరం హింస, ఇతర పరిస్థితులను వివరించి చర్యలు తీసుకోవాలని కోరారు. మైనింగ్, ఇసుక అక్రమ రవాణ, మద్యం అక్రమాలతో ప్రజల జీవితాల్లో చిచ్చుపెట్టిన ఏ ఒక్కర్నీ వదలొద్దన్నారు. కొన్ని ప్రాంతాలను ఐదేళ్లపాటు రావణకాష్టంగా మార్చిన అరాచక శక్తులను ఉక్కుపాదంతో అణిచివేయాలని కోరారు.

ఉపాధ్యాయినిపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

(మొదటి పేజీ తరువాయి)

సస్పెండ్ చేశారని చెప్పారు. దుర్ఘటనలో వీరి ప్రమేయం ఏమీ లేకున్నా చర్యలు తీసుకున్నారన్నారు. ఒక ఉద్యోగి ఆ స్థాయికి రావడానికి ఉద్యోగితో పాటు కుటుంబ సభ్యుల శ్రమ ఎంతో ఉంటుందని, ఆ ఉద్యోగి పైనే ఆ కుటుంబమూ ఆధార పడి ఉంటుందనే విషయం గ్రహించాలని కోరారు. ఎన్నికల విధుల్లో భాగంగా సస్పెండ్ అయిన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు తిరిగి పోస్టింగ్ ఇవ్వాలని తాజాగా ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చినా షహనాస్ బేగంపై సస్పెన్షన్‌ను ఎత్తేకకపోవడం సరికాదన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో సస్పెన్షన్లను తొలగించారని, పల్నాడు జిల్లాలోనూ సత్వరం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి హామీనిచ్చారు .

చంద్రశేఖర్, కృష్ణదేవరాయలు ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

లోక్‌సభకు ఎన్నికైన లావు శ్రీకృష్ణదేవరాయులు కూడా ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాన మంత్రికి, ప్రొటెం స్పీకర్‌కు అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒకప్రకటన విడుదల చేస్తూ పల్నాటి ప్రజల అంతులేని అభిమానం, ఆధరాభిమానాలు తనను మరోసారి గొప్ప విజయంతో పార్లమెంట్ సభ్యునిగా చేశాయని, పల్నాటి జిల్లా వాసు సంక్షేమమే పరమావధిగా, అభివృద్ధే ఆలోచనగా తన ప్రతి అడుగు ఉంటుందని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని, వారి సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. తనకు ఎంపీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

110 బస్తాల రేషన్ బియ్యం సీజ్

కొమెరపూడి రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు దాడులు



రైస్‌మిల్లులో సోదాలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో ఉన్న రైస్ మిల్లు పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. రైస్ మిల్లు నిర్వాహకులు రేషన్ బియ్యాన్ని అక్రమగా నిల్వ చేశారన్న సమాచారం మేరకు రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశముల మేరకు, గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ ఎస్.పి. శ్రీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు, శ్రీ విఘ్నేశ్వర రైస్ మిల్లు లో సోదాలు నిర్వహించారు. అక్రమగా నిల్వ ఉంచిన 110 బస్తాల రేషన్ బియ్యం సీజ్ చేశారు మిల్లు నిర్వహకులు రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి, నిల్వ వుంచి రీసైక్లింగ్ చేసి విక్రయిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. మిల్లు యజమానిపై 6ఎ కేసు నమోదు చేయాలని సత్తెనపల్లి పౌరసరఫరాల శాఖ ఉప తహశీల్దార్ అరుణాదేవిని విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు ఆదేశించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన‍్స్పెక్టర్లు ఎస్. శ్రీనివాసులు రెడ్డి, ఎ.శ్రీహరిరావు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ షాక్‌తో వెల్డింగ్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

ప్రమాదవుశాత్తు విద్యుత్ షాక్ తగిలి వెల్డింగ్ పనిచేస్తున్న కార్మికుడు సోమవారం మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని జానపాడులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన సయ్యద్ మస్తాన్ వలి(30) జానపాడులోని ఓ భవనంలోని మొదటి అంతస్తులో మెట్లకు సంబంధించిన వెల్డింగ్ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు ఇనుప రాడ్డు ఆ భవనానికి అనుకొని వున్న 3 కెవి సర్వీస్ తీగలకు తగిలింది. దీంతో, విద్యుత్ షాక్ తగిలి అతను కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు మస్తాన్‌ను పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.అప్పటికే మస్తాన్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మస్తాన్ భార్య గర్భవతి అని, వారికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు చెప్పారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

కుటుంబ కలహాల కారణంగా ఎలుకల మందు తిని ఆత్మహత్యకు విఫలయత్నం చేసిన వివాహిత మహిళ జాష్టి దుర్గా భవాని (19) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తెనపల్లి మండలంలోని ధూళిపాళ్లకి చెందిన బత్తుల దుర్గా భవానీకి గుంటూరులోని బొంగరాల భీడుకు చెందిన జాష్టి భానుతో వివాహం జరిగింది. భార్యా భర్తల మధ్య వివాదాల కారణంగా భర్త తో విడిపోయి తల్లి వద్ద ఉంటోంది. విడాకుల కేసు కోర్టులో పెండింగులో ఉంది. అయితే, దుర్గా భవాని మరొక వ్యక్తితో పెళ్ళికి సిద్ధ పడింది. ఇందుకు ఆమె తల్లి ఒప్పుకోలేదు. దీంతో, మనస్థాపం చెందిన ఆమె ఈ నెల 18న ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు విఫలయత్నం చేసింది. సత్తెనపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటో జర్నలిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి-ముప్పాళ్ల



గుర్తుతెలియని వాహనాం ఢీ కొని ఫోటో జర్నలిస్ట్ దుర్మరణం చెందిన ఘటన మండలం లోని గోళ్ళపాడు చప్టా వద్ద ఆదివారం అర్ధ రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం క్రోసూరుకి చెందిన ఓ పత్రికలో పని చేస్తున్న ఫొటో జర్నలిస్ట్ జొన్నలగడ్డ మీరయ్య(50) వృత్తిలో భాగంగా ద్విచక్రవాహనంపై నర్సరావుపేట వెళ్ళి తిరిగి వస్తుండగా గోళ్ళపాడు చప్టా వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని సత్తెనపల్లి ఏరియా వైద్య శాలకు తరలించినట్లు ఎస్ఐ హజరతయ్య తెలిపారు. మీరయ్యకి భార్య,కుమారుడు,కుమార్తె ఉన్నారు. గోళ్ళపాడు చప్టా వద్ద తరచుగా ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అక్కడ ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది.

కానిస్టేబుల్ విధులకు ఆటంకం .. ఫ్లెక్సీ చింపివేతపై కేసులు నమోదు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు : విధుల్లో ఉన్న కానిస్టేబుల్ కి ఆటంకం కలిగించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన ప్రత్తిపాడు మండల కేంద్రం లోని గొట్టిపాడులో జరిగింది. ప్రత్తిపాడు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెదగొట్టిపాడు ఎస్సీ కాలనీ స్టేజి సెం టర్ లో పంచాయతి, పోలీస్ అనుమతి లేకుండా రాజకీయ నాయకుల ఫొటోలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అక్కడ శాంతి భద్రతల సమస్య ఉన్నందున ఆ ఫ్లెక్సీని ఏర్పాటు చేయొద్దని పోలీసు అధికారులు తెలియజేసినప్పటికీ పట్టించుకోకపోగా, అక్కడ డ్యూటీలో ఉన్న ప్రత్తిపాడు పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ బివి సుబ్బయ్య విధులకు అదే గ్రామానికి చెందిన పిల్లి జయరావు, మరికొందరు ఆటంకం కల్గించారు. ఈ మేరకు కానిస్టేబుల్ సుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫ్లెక్సి చింపినందుకు కేసు నమోదు చేసిన సంఘటన ప్రత్తిపాడు మండలంలోని పెదగొట్టిపాడు ఎస్ సి కాలనీలో జరిగింది. ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపిన ప్రకారం స్థానిక స్టేజి సెంటర్ లో పిల్లి జయరావు కుమారుడి పుట్టిన రోజు సంద ర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సిని అదే గ్రామానికి చెందిన పిల్లి రాజేష్ అనే అతను చింపేశాడు. ఈ విషయమై ప్రశ్నించిన జయరావును, అతని భార్యను రాజేష్ అసభ్య పదజాలంతో దూషించాడు. జయరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 45,769
మిర్చి ఎగుమతి	: 40,696
మిర్చి నిల్వ	: 17,563

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 - 16,500
నెం.5	10,000 - 14,500
273	11,000 - 14,500
341	9,000 - 17,000
	నాన్ ఎసి
తేజ	7,500 - 20,000
బడిగి	9,000 - 16,000
దేవనూరు డీలక్స్	10,000 - 15,500
తాలుకాయలు	4,500 - 12,000
	ఎసి
334	9,000 -18,000
నెం.5	13,500 - 13,500
341	9,000 - 18,000
4884	10,500 -16,500
తేజ	10,500 - 19,700
బడిగి	9,500 - 15,000
దేవనూరు డీలక్స్	15,000 - 15,000
తాలుకాయలు	5,000 - 11,000

రెండు ఇళ్లల్లో చోరీ.. రూ.3 లక్షల సొత్తు అపహరణ

ప్రజాశక్తి -నాదెండ్ల

రెండు ఇళ్లల్లో జరిగిన చోరీలో సుమారు మూడు లక్షల రూపాయల సొత్తు అపహరణకు గురైన సంఘటనలు మండలంలోని గణపురంలో సోమవారం చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై బలరాం రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గణపురం గ్రామానికి చెందిన పులిచెర్ల వెంకట రఘురామిరెడ్డి, బొప్పూడి గ్రామం వద్ద ఉన్న శ్రీ ధనలక్ష్మి కాటన్ రైస్ మీల్స్ కంపెనీలో ఆయిల్ డివిజన్ ఆఫీస్‌లో క్లర్క్ గా పని చేస్తున్నాడు. హైదరాబాదులో ఉంటున్న తన మనుమడు పుట్టినరోజు ఈ నెల 21వ తేదీన





ఉండటంతో 19 తేదీ రాత్రి ఇంటికి తాళం వేసి వెళ్లారు. 24వ తేదీ ఇంటికి వెళ్లి చూడగా ఎనుక వైపు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి ఇంట్లో ఉన్న బీరువాను పగలగొట్టి అందులో ఉన్న నల్ల పూసలు, చెవి కమ్మలు, నాలుగు జతలు పోగులు, ఉంగరాలు మొత్తం కలిపి ఎనిమిది సవర్ల బంగారం అపహరణకు గురైనట్లు ఫిర్యాదు చేశారు. నాదెండ్ల ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే నుండి ప్రాణహాని ఉంది

గతంలో మద్యం దుకాణంలో వాటాకు రూ. 20 లక్షల లంచం

ధాన్యం వ్యాపారి, టిడిపి నాయకులు గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఎస్.ఐ కెపి రవీంద్రకు ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస రెడ్డి

నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి నుండి ప్రాణ హాని ఉందని రక్షణ కల్పించాలని కోరుతూ రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం గ్రామానికి చెందిన ధాన్యం వ్యాపారి, టిడిపి నాయకులు గంగిరెడ్డి శ్రీనివాస రెడ్డి సోమవారం మండల కేంద్రం రొంపిచర్ల పోలీస్ స్టేషన్ లో ఎస్.ఐ కెపి. రవీంద్ర కు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో సెప్టెంబర్ 2022 వ సంవత్సరంలో బార్ షాపులకు ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేసిన నేపథ్యంలో బార్ షాపులో వాటా కోసం అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరుల సూచన మేరకు ఎమ్మెల్యేను సంప్రదించగా, రూ 20 లక్షలు డిమాండ్ చేయడంతో అదే ఏడాది అక్టోబర్ 4న ఇక్కుర్తి గ్రామ పర్యటనలో ఉన్న గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డికి ఆ నగదు మొత్తం ఇచ్చినట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇరవై రోజుల్లో బార్ షాప్ లో వాటా ఇప్పిస్తానని చెప్పి.. ఇవ్వకుండా తనను ఇబ్బంది పెట్టారని, ఇదేమని ప్రశ్నిస్తే దాడికి యత్నించి,అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపించారు. తెలంగాణ మద్యం విక్రయిస్తున్నానంటూ తనపై కేసు పెట్టి జైలుకు పంపించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే నుండి తనకు తన కుటుంబానికి ప్రాణ హాని ఉండటంతో ఆందోళన చెందుటున్నట్లు పేర్కొన్నారు.



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు.. ఇన్‌సెట్‌లో మృతుడు పాలపర్తి సుబ్బారావు (ఫైల్)

సిపిఎం సభ్యులు పాలపర్తి సుబ్బారావు మృతి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని మదర్ థెరిస్సా కాలనీకి చెందిన సిపిఎం సభ్యులు పాలపర్తి సుబ్బారావు (72) అనారోగ్యంతో సోమవారం ఉదయం 11 గంటలకు మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు. సుబ్బారావు భౌతికకాయాన్ని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, నాయకులు ఎస్.లూథర్ సందర్శించి సిపిఎం జెండాను కప్పి నివాళు లర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రిక్షా యూనియన్‌లో 30 ఏళ్లుగా పని చేస్తున్న సుబ్బారావు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. సిపిఎం సభ్యులుగా తుది శ్వాస విడిచే వరకూ పార్టీ ఆశయాలకు అనుగుణంగా పని చేశారని అన్నారు. నివాళులర్పించిన వారిలో ఎస్.బాబు, బి.కోటానాయక్, సత్యం, పి.శ్రీనివాసరావు ఉన్నారు.



విరాళాన్ని శివకుమారికి అందిస్తున్న వీరయ్య

పల్నాడు విజ్ఞాన కేంద్ర భవన నిర్మాణానికి వీధి విక్రేత విరాళం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కోటప్పకొండ రోడ్డులో నిర్మాణ దశలో ఉన్న పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ భవన నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన పండ్ల విక్రేత తంగిరాల వీరయ్య రూ.5 వేల విరాళం అందజేశారు. చిలకలూరిపేట మండలం యడవల్లికి చెందిన వీరయ్య సైకిల్ పై వీధివీధీ తిరుగుతూ పండ్లు విక్రయిస్తుంటారు. అతని భార్య, కుమారుడు తోపుడు బండిపై ఒక ప్రాంతంలోనే ఉండి పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈ క్రమంలో రూ.5 వేల విరాళాన్ని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారికి వీరయ్య సోమవారం అందజేశారు. దీనిపై ట్రస్ట్ చైర్మన్ గుంటూరు విజయ్ కుమార్, కన్వీనర్ అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు వీరయ్యకు అభినందనలు తెలిపారు. ప్రజల్లో అభ్యుదయ భావాలు, విజ్ఞానాన్ని పెంచడంతోపాటు కనుమరుగవుతున్న సంస్కృతి సంప్రదాయాలకు ఊపిరిపోస్తూ ప్రజా పోరాటాలకు కేంద్రంగా నిర్మితమవుతున్న పల్నాడు విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు.

పున:ప్రారంభంలో తొలిగా 50 అర్జీలు



ప్రజల నుండ అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, డిఆర్ఒ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల నేపథ్యంలో కొన్ని వారాలపాటు నిలిచిన స్పందన కార్యక్రమం గ్రీవెన్స్ పేరుతో సోమవారం పున:ప్రారంభమైంది. గత ప్రభుత్వ హయాంలో జగనన్నకు చెబుదాం పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమం తాజాగా నూతన ప్రభుత్వం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) 'మీకోసం' పేరుతో నిర్వహించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి 50 ఫిర్యాదులు అందినట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు నడుచుకోవాలని, ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ ఆదేశించారు. ప్రజల నుండి వినతులను కలెక్టర్‌తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం స్వీకరించారు.

సాయం కోసం ఒకరు, పింఛను కోసం మరొకరులు

రెండు కాళ్లు లేని తాను కూడు, గూడు కోసం ఒకరిపై ఆధారపడాల్సి వస్తుండడంతో ఆత్మాభిమానం అడ్డువస్తోందని, ఆర్థిక సహాయం చేస్తే చిరు దుకాణం పెట్టుకొని గౌరవంగా బతుకుతానని నరసరావుపేట మండలంలోని యలమందకు చెందిన రాయపూడి కోటమ్మ విన్నవించారు. అదే గ్రామానికి చెందిన అంబటి మహాలక్ష్మి కాళ్లు చేతులు బాగానే ఉన్నా పుట్టుకతోనే ఎత్తు తక్కువతో కావడంతో 35 ఏళ్ల వయసున్న తనకు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకున్నారు. వీరిని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు గమనించి వారితో మాట్లాడారు. వారి సమస్య విని పరిష్కారానికి డిఆర్ఒను ఆదేశించారు.



చదువు కోసం అన్నాచెల్లెళ్ల వినతి

నాగార్జునసాగర్, లేదా సత్తెనపల్లి గురుకుల పాఠశాలలో తమకు సీటు కేటాయించి చదువుకునేందుకు ఆటంకం లేకుండా చూడాలని పిడుగు రాళ్ల మండలం కరాలపాడుకు చెందిన 9వ తరగతి విద్యార్థి నాగచైతన్య, తన చెల్లెలు 8వ తరగతి విద్యార్థిని నందిని వినతిపత్రం అందజేశారు.



కుటుంబం దెబ్బతింది.. ఆదుకోండి..

స్టేజ్ పై డాన్స్‌లేస్తూ, పాటలు పాడుతూ జీవనం సాగిస్తున్న క్రమంలో పెద్దలు లారీ డ్రైవర్ నరసింహారావు అనే వ్యక్తికి వివాహం జరిపించారని, తమకు ముగ్గురు సంతానం కాగా 12 ఏళ్ల క్రితం భర్త మృతి చెందారని కుటుంబానికి అండగా ఉన్న పెద్ద కుమారుడు కొన్ని నెలల క్రితం అనుమానస్పద స్థితిలో మృతి చెందాడని, కుమారుడి మరణంతో బ్రెయిన్ స్ట్రోక్ పెరాలసిస్ వచ్చిదని, కుటుంబ పోషణ భారమైన దృష్ట్యా వితంతు పింఛను మంజూరు చేయాలని నరసరావుపేట పట్టణం బాబాపేటకు చెందిన దార్ల ధనలక్ష్మి విన్నవించారు. ప్రస్తుతం మంచానికి పరిమితమైన తల్లి తన వద్ద ఉంటోందని, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



బిడ్డ కోసం మారుతల్లి వినతి

పుట్టుకతోనే వికలాంగురాలైన పదేళ్ల జానకమ్మకు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని క్రోసూరు మండలం గోరంట్లకు చెందిన మారుతల్లి అణవమ్మ, తండ్రి కూచిపూడి శ్రీనులు వేడుకున్నారు. కూలి పని చేసుకుంటేనే కుటుంబం గడుస్తుందని తమ ఆర్థిక దుస్థితిని వివరించారు.



హక్కుల కోసం ఉద్యమ సమయం ఆసన్నం

వ్యవసాయ మార్కెట్ యార్డు ముఠా వర్కర్స్ యూనియన్ మహాసభలో చలమయ్య - నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, ఈ నేపథ్యంలో హక్కుల సాధన కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఏపీ రైతుసంఘం పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గద్దె చలమయ్య అన్నారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ముఠా వర్కర్స్ యూనియన్ 15వ మహాసభ యూనియన్ అధ్యక్షులు అమర్తులూరు డేవిడ్‌రాజు అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన చలమయ్య మాట్లాడుతూ కార్మికులకు ప్రత్యేకంగా విశ్రాంతి గదులను ఏర్పాటు చేయటం లేదని, గుర్తింపు కార్డులను ఇవ్వటం లేదని అన్నారు. ప్రమాదాలకు గురై మరణించిన సందర్భంలో వారి కుటుంబాలను ఆదుకునే విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుకూలంగా కార్మికుల కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం.హరిపోతురాజు మాట్లాడారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జె.రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చింతపల్లి రమేష్, అధ్యక్షులుగా గుజ్జర్లపూడి ప్రభుదాసు, ఉపాధ్యక్షులుగా అమృతలూరి డేవిడ్ రాజు, సభ్యులుగా గుజ్జర్లపూడి ప్రభుదాసు, మల్లా వెంకయ్య, బద్దెపూడి మోషే, గుజ్జర్లపూడి కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



మహాసభలో మాట్లాడుతున్న గద్దె చలమయ్య

టాప్-5 విద్యార్థులకు ఇకపై స్కాలర్‌షిప్‌లు

- త్వరలోనే విద్యారంగ ప్రక్షాళన
- విద్యార్థినులకు విద్యాకిట్ల పంపిణీలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

గత ప్రభుత్వం విధ్వంసం చేసిన రాష్ట్ర విద్యారంగంలో త్వరలో సమూల మార్పులు, ప్రక్షాళన ఉంటాయని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. నియోజకవర్గం పరిధిలో అన్ని జెడ్పీ పాఠశాలల్లో టాప్-5లో నిలిచే విద్యార్థులకు సొంతంగా స్కాలర్‌షిప్‌లు అందిస్తామని ప్రకటించారు. పట్టణంలోని ఒకటో వార్డు బాలికల ఉన్నత పాఠశాలలో విద్యా కిట్లను సోమవారం పంపిణీ చేయగా జీవీ ఆంజనేయులుతోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యా కిట్లు అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్న జీవీ ఆంజనేయులు త్వరలోనే పరిస్థితులన్నీ చక్కబడతాయని చెప్పారు. ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా పదో తరగతి ఫలితాల్లో 86 శాతం ఉత్తీర్ణత సాధించడంపై హెచ్ఎం నాగలక్ష్మిని ప్రత్యేకంగా అభినందించారు. గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో వందకు వంద మార్కులు సాధించిన విద్యార్థులు ఈ పాఠశాలలో ఉండటం సంతోషకరమని అన్నారు. ఈ పాఠశాల జిల్లాలోనే నంబర్ వన్‌గా, రాష్ట్రంలోనే టాప్-10లో ఒకటిగా ముందుకెళ్తున్నందుకు అభినందనలు తెలిపారు. తాను కూడా పేద రైతు కుటుంబం నుంచి వచ్చానని, ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని, ఇకపై పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు అన్ని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదివి టాప్-5 మార్కులు సాధించిన విద్యార్థులకు వచ్చే ఐదేళ్లు శివశక్తి ఫౌండేషన్ ద్వారా ప్రతిభ ఉపకారవేతనాలు అందిస్తానని ప్రకటించారు. మొదటి స్థానం వచ్చిన వారికి రూ.5 వేలు, మిగిలిన వారికి రూ.3 వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందిస్తామన్నారు. మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్య, విద్యార్థుల పట్ల అపార గౌరవం ఉండడంతోనే శివశక్తి ఫౌండేషన్ ద్వారా ఎంతోమందికి చేయూతనిస్తున్నారని కొనియాడారు. కొత్త ప్రభుత్వం రాగానే పాత ప్రభుత్వం రూపొందించిన కిట్లను ఎక్కడా పక్కనపెట్టకుండా, పక్షపాతధోరణి చూపకుండా వాటినే విద్యార్థులకు పంచే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టడం గొప్పవిషయమన్నారు. ఎన్ఎస్పి కాలనీలో పాఠశాల భవనం పూర్తి చేసి విద్యార్థుల్ని అక్కడికి పంపేందుకు జీవీ చొరవ తీసుకుంటారని అన్నారు.



కిట్లు అందిస్తున్న జీవీ ఆంజనేయులు, మల్లికార్జునరావు

తాగునీరు వృథా పట్టని అధికారులు

నెలరోజులుగా పైప్‌లైన్ లీకేజీ

ప్రజాశక్తి - దుగ్గిరాల :తాడేపల్లి నుండి తెనాలి పట్టణానికి తాగినీరు సరఫరా చేసే పైపులైన్‌కు స్థానిక అలీ నగర్ వద్ద లీకేజీ ఏర్పడినది. దీనివలన పైప్ లైన్ నుండి లీక్ అవుతున్న నీరు చుట్టుపక్కల ప్రాంతాలను ముంచి వేసినది స్థానిక ప్రజలు నడిచే రహదారులపై చేరినది. దీనితో దోమలు అక్కడ ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయని స్థానికులు వాపోతున్నారు. స్థానిక ప్రజలు తెనాలిలోని సంబంధిత అధికారులను అనేక పర్యాయాలు ఫిర్యాదు చేసినప్పటికీ వారి నుండి ఎటువంటి స్పందన లేదని వాపోతున్నారు. ఈ లీకేజీ గత నెల రోజుల క్రితమే ఏర్పడిందని ఎన్నిసార్లు అధికారులను కలిసి చెప్పినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీ కి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.



పైప్ లైన్‌కు లీకేజీ ఏర్పడి వృథా అవుతున్న నీరు

పార్కింగ్ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు :గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో వాహనాల పార్కింగ్ పనులను వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న పార్కింగ్ పనులను పరిశీలించి, డిఈఈ రమేష్ బాబు, ఏఈ రాంబాబులకు తగు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిఎంసి ప్రధాన కార్యాలయంలో సరైన పార్కింగ్ వసతి లేక కార్యాలయ సిబ్బంది, వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అసౌకర్యంగా ఉంటుందన్నారు. పార్కింగ్ కోసం కేటాయించిన ప్రాంతంలో కార్లు, ద్విచక్ర వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ టైల్స్ ఏర్పాటు చేయడానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. కావున పనులు వేగవంతం చేయాలన్నారు. అలాగే వర్షం నీరు జిఎంసి ప్రధాన కార్యాలయం దగ్గర నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, టాయ్ లెట్స్ ని కూడా మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

డిజిపికి ఎమ్మెల్యే నసీర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ నూతన డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్.ద్వారకా తిరుమలరావును గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ డిజిపి కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చి అభినందనలు తెలిపారు.





28న హిందూ ఫార్మసీ కాలేజీలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీన స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 30 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పిజి విద్యార్హతలు కలిగి, 18-35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు హాజరు కావచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హతల సర్టిఫికెట్లు, బయోడేటాతో 28న ఉదయం 9.30 గంటలకు హిందూ ఫార్మసీ కాలేజిలో ఇంట ర్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 6364867800, 6364867801, 6364867802 నంబర్లలో సంప్రదించాలన్నారు.



తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాజట్ల ఎంపిక

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నగరంలోని సి కె బాలుర హై స్కూల్ నందు జిల్లా స్థాయి టైక్వాండో(క్యాడెట్) బాలురు, బాలికల సెలెక్షన్స్ సోమవారం జరిగాయి. ఈ పోటీలలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు ఈ నెల 30 వ తేదీన వైజాగ్‌లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి గుంటూరు జిల్లా జనరల్ సెక్రెటరీ పడవల సుబ్బారావు తెలియజేశారు. పతకాలు సాధించిన విద్యార్థులను పీ.సుబ్బారావు అభినందించారు.

ఎపిసిఎన్‌ఎఫ్ జిల్లా అధ్యక్షునిగా వెంకటేశ్వర్లు ఎన్నిక

ప్రజాశక్తి -గుంటూరు

గుంటూరు జిల్లా కమ్యూనిటీ న్యాచురల్ ఫామింగ్ (ఎపిసిఎన్‌ఎఫ్) ప్రకతి వ్యవసాయ జిల్లా సిబ్బంది అధ్యక్షునిగా ఇర్ల.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షునిగా వై .నేతాజీ , ప్రధాన కార్యదర్శిగా శ్యాంబాబు, ట్రెజరర్ ఏవి పాండురంగారావు , ఉపాధ్యక్షులుగా రామకష్ణ, జి రేణుక, కే రామాంజనేయులు, డి రజిని, శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా నిక్కి, తిరుపతిరావు, ఎం .అన్నామణి, సాగర్ బాబు, ఎం.రాహేల్ రావు, 50 మంది సభ్యులను ఎన్నుకున్నారు. సోమవారం పాత గుంటూరు లోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజీ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఏపీ సీఎన్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా.వరప్రసాద్ సంధాన కర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షులు ఇర్ల.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు సిబ్బందికి 16 నెలలకు పైగా అందని గౌరవ వేతనాల గురించి, ప్రభుత్వ పరంగా అందవలసిన అన్ని సౌకర్యాలను అందేటట్లు చేస్తానని సిబ్బందికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

ప్రతి సోమవారం అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం సోమవారం నుంచి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. గత మార్చి నెలలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి నిలిపివేసిన స్పందన కార్యక్రమం మళ్లీ ప్రారంభించనున్నట్లు చెప్పారు.నూతన రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులను మీ కోసం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. నగరపాలక సంస్థ వివిధ విభాగాలకు చెందిన అధికారులు అందరూ పాల్గొంటారని తెలిపారు.తద్వారా సత్వర పరిష్కార చర్యల దిశగా పని చేస్తామని ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టిప్పర్ల బజార్లో పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ వి నిర్మల్ కుమార్ సోమవారం మంగళగిరి పట్నంలోని టిప్పర్ల బజార్-2 సచివాలయ పరిధిలో పర్యటించి పారిశుధ్య పనులను, వర్కర్ల అటెండెన్స్‌ను పరిశీలించారు. అనంతరం గౌతమ బుద్ధ రోడ్డు డ్రెయిన్ వద్ద ఏర్పాటు చేసిన డీసిల్టేషన్ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ మంగళగిరిని పరిశుభ్రత వైపు నడిపే దిశగా కార్యక్రమాలు నిబద్ధ తతో నిర్వహించాలన్నారు. నగరంలోని రహ దారులు, డ్రెయిన్లు, పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తడి చెత్త, పొడి చెత్త గురించి ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించి నగర పరిశుభ్రత పరిరక్షణలో భాగస్వామ్యులను చేయాలని కోరారు. అలానే మీ మీ సచివాలయ పరిధిలో ఖాళీ స్థలములను గుర్తించి ఆయా యజమానులకు నోటీసులు జారీ చేసి జంగిల్ క్లియరెన్స్ చేసుకొను విధముగా, అలానే ఆ చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చూసే విధంగా చర్యలు చేపట్టి వారికి అవగాహన కల్పించాలని కోరారు.అదేవిధంగా ఇంటి పన్ను నీటి పన్ను వసూళ్లు సక్రమంగా నిర్వహించాలని సచివాలయ సెక్రటరీలకు ఆదేశించారు. కార్య నిర్వహణలో ఏవైనా సమస్యలు తలెత్తినట్లయితే పై అధికారుల దృష్టికి తీసుకు వచ్చినచో తక్షణమే పరిష్కారం కొరకు చర్యలు చేయబడుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో డిఈ ఈ కృష్ణా రెడ్డి, ఎం పి హెచ్ వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్



మాట్లాడుతున్న చాంద్‌బాషా

నగదు రహిత వైద్యం అమలు చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

గత ప్రభుత్వంలో నగదు రహిత చికిత్సలు జరకపోవటంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు చాలా ఇబ్బంది పడ్డారని, కావున ఈ ప్రభుత్వంలోనైనా నగదు రహిత వైద్యం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా కోరారు. సోమవారం నగరంపాలెంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము ఈహెచ్‌ఎస్ స్కీమ్‌కు నెలకు రూ.220లు, రూ.330లు చొప్పున చెల్లిస్తున్నామని, అలా ప్రభుత్వానికి నెలకు దాదాపు రూ.12 కోట్లకుపైగా జమ అవుతుందన్నారు. అయినా ఉద్యోగులు, పెన్షనర్లకు నెట్వర్క్ హాస్పిటల్స్‌లో ఎటువంటి నగదు రహిత చికిత్స అందట్లేదని తెలిపారు. ప్రతి సంవత్సరం ఉద్యోగులు చెల్లిస్తున్న చందా వెంటనే హాస్పిటల్ యాజామాన్యానికి చెల్లిస్తే అందరికీ నగదు రహిత చికిత్స జరిగే అవకాశం ఉందని, కావున ఈ ప్రభుత్వంలోనైనా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత చికిత్స జరిగేలా ప్రభుత్వం కషి చేయాలని కోరారు.

29న రజకవృత్తిదారుల సంఘం మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక కృష్ణనగర్ 1వ లైన్‌లో ఈనెల 29న మద్యాహ్నం 2 గంటలకు జరిగే ఆంధ్రప్రదేశ్ రజక వృత్తి దారుల సంఘం నగర మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ సంఘ నాయకులు సోమవారం నగరంలోని పలు చోట్ల కరపత్రాలు పంపిణీ చేశారు. రజకవృత్తిదారులకు సామాజిక రక్షణచట్టం ఏర్పాటు చేయాలని, రజక అభివృద్ధి కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి రజక వృత్తిదారుడికీ వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని, రజకవృత్తిదారుల వృత్తి నిర్వహణకు అవసరమైన పరికరాలు ఆదరణ పథకం ద్వారా ఇవ్వాలనే డిమాండ్లపై మహాసభలో చర్చించి, భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకోవటం జరుగుతుందని పట్టణ కార్యదర్శి మండూరు వెంకట నర్సయ్య తెలిపారు. కావున రజకవృత్తిదారులు, రజక ఉద్యోగులు, అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌లు, ఇస్త్రీదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అద్దంకి సాంబశివరావు, పి.రాంబాబు, కె.భాస్కరరావు, వి.వెంకటేశ్వరరావు, సిహెచ్.సత్యనారాయణ, స్వామి, పాదర్తి పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

పరిష్కారంతో ఇంటికి వెళతామనే నమ్మకం కల్పించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు
- సమస్యల పరిష్కారానికి 'మీకోసం'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రారంభించిన 'మీ కోసం' నూతన ఒరవడి అని ఎమ్మెల్యే డాక్టర చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేటలోని కలెక్టరేట్ సోమవారం వద్ద ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని పరిశీలించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 'మీ కోసం'లో ఫిర్యాదు చేసిన కక్షిదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు.సమస్యలపై ఫిర్యాదు చేస్తే పరిష్కారంతోనే ఇంటికి వెళతామనే నమ్మకం ప్రజల్లో కల్పించాలన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో ప్రజలను సమస్యలు వెంటాడాయని, నాడు అధికార పార్టీ నేతలతోనే ఎక్కువ సమస్యలు వచ్చాయన్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద దాతలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గతంలో అన్న క్యాంటీన్ల ద్వారా పేదలం దరికీ కేవలం రూ 5 కే కడుపు నిండా అన్నం పెట్టిన విష యాన్ని గుర్తుచేశారు. గత ప్రభుత్వం పేదల పొట్ట కొట్టిం దని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను తెరుస్తా మని, గ్రీవెన్స్ కోసం వచ్చే ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా భోజనం , తాగునీరు, మజ్జిగ సదుపాయాలు కల్పిస్తా మని చెప్పారు.



'మీకోసం'లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన అర్జీదారులకు ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అరవింద బాబు

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-మాచర్ల

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం ఉద యం ప్రారంభించినట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లోని కలెక్టర్ కార్యాలయం, మండల పరిధిలోని తహశీల్దార్, మున్సిపల్ తదితర చోట్ల ఫిర్యాదుదారులు ఇచ్చే వినతులను ఆన్‌లైన్ చేస్తారని, ఆ వినతులతో పాటు వారి ఆధార్ నంబర్, సెల్ నంబర్‌లను కూడ అధి కారులు సేకరిస్తారని తెలిపారు. వినతులను ఆన్‌లైన్ చేస్తారు కనుక వారికి ఒక నంబర్ ఇస్తారని తద్వారా ఆయా సమస్యలు ఏ మేరకు పరిష్కార మయ్యాయో తెలుస్తుందని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని కోరారు.

'నేను బడికి పోతా' ..విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి - దుర్గి

'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులతో పాఠశాల నుండి బస్టాండ్ వరకు ర్యాలీని నిర్వహించారు. దుర్గి మండల విద్యాశాఖ అధికారి-2 డి. బెంజిమెన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దుర్గి బస్టాండ్ సెంటర్లో విద్యార్థులతో మానవహారంగా ఏర్పడ్డారు. విద్యాశాఖాధికారి మాట్లా డుతూ ప్రభుత్వ పథకాల గురించి, బడిఈడు పిల్లలు పాఠశాలలో చేర్పించాలని తెలియజేశారు. గత సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో దుర్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చంద్రశేఖర్‌రెడ్డి 578 మార్కులు సాధించి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలన్నింటి లోకి మొదటి స్థానం సాధించిన విషయాన్ని ప్రస్తా వించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోంది కనుక తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వం అందించే ఉచిత పుస్తకాలు, ఉచిత దుస్తులు మొదలైన ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్య క్రమంలో దుర్గి హైస్కూలు ఇన్‌ఛార్జి హెచ్‌ఎం మల్లి కార్జునరావు, పిడి బండ్ల ప్రసాద్, ఉపాధ్యాయులు అనంత రామయ్య, మం డల సిఆర్‌పిలు సుబ్రమణ్యం, కిషోర్, కొండలు, శ్రీని వాసరావు, యశోదరావు పాల్గొన్నారు.

పురుషులతో దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



ఎమ్మెల్యే అరవిందబాబును సత్కరిస్తున్న ఎం.ఇ.ఓ డి. బ్రహ్మేశ్వరరావు, ప్రిన్సిపల్ శౌరీలు

పురుషులతో దీటుగా మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ ఇలా అన్ని రంగాలలో మహిళల పాత్ర కీలకంగా మారిందని, ఇదంతా కేవలం విద్య ద్వారానే సాధ్యమవుతుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. రొంపిచర్ల మండలం సంతగుడిపాడు లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమ వారం స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువు ద్వారానే తెలివి తేటలు, ధైర్యం ఒంట బడతాయన్నారు. చదువుకు మించిన గొప్ప ఆయుధం మరేది లేదన్నారు. బాలికలు పురుషులతో దీటుగా అన్ని రంగాలలో పోటీ పడాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యేను ఎంఇఒ డి.బ్రహ్మేశ్వరరావు, ప్రిన్సిపల్ శౌరీలు ఘనంగా సన్మానించారు. అనంతరం నరసరావుపేట పట్టణంలోని బరంపేట ప్రభుత్వ పాఠశాలలో స్టూడెంట్ కిట్స్ పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు,బ్యాగ్ లు పంపిణీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని క్యాంపు-2 పాఠశాలలో స్థానిక టిడిపి నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు,స్కూల్ బ్యాగ్ లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాటశాల హెచ్ ఎం మల్లి కార్జునరావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతోందని, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో విజయపురిసౌత్ టిడిపి అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు,మైలపల్లి అప్పలరాజు, డా.ఎన్.బసివిరెడ్డి, ఆడెపు కోటయ్య, తోటకూరపరమేశ్వరావు, సత్తిబాబు, కట్టారాజు,ఎమ్మార్పీఎస్ నాయకుడు ఊరే మార్క్, తదితరులు పాల్గొన్నారు.

చదువు భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి-పెదకూరపాడు

చదువు భవిష్యత్తుకు పునాది అని పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు అన్నారు. పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ సర్పంచ్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల సైతం ఉన్నత స్థితికి వెళ్ళటానికి ప్రభుత్వం పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు తదితర అన్ని ఉచితంగా ఇస్తుందన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సాంబశివరావు, నాగరాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు పెంచేందుకు 'విద్యాప్రవేశం'

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచేందుకు 'విద్యాప్రవేశం' అనే నాలుగు వారాల కార్యక్రమం ప్రవేశపెట్టడం జరిగిందని కృష్ణా రెడ్డి డొంకలోని మున్సిపల్ పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యా యులు పోటు శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో పట్టణంలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ము న్సిపల్ ప్రాథమిక పాఠ శాల ఆవాస ప్రాం తంలో బడిఈడు విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించి నట్లు తెలిపారు. పాఠశాలల్లో విద్యా ర్థుల నమోదు పెంపునకు పాఠశాల పే రెంట్స్ కమిటీ, సమాజం భాగస్వామ్యం వహిం చాలని కోరారు. బాల్యంలో వారికి చదువు పొందే హక్కు వుందని, దానిని తల్లిదండ్రులు హరించకూడదని అవగాహన కల్పించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పి స్తుందని, పోషకాహారం అందిస్తుందని, 'తల్లికి వందనం' ద్వారా నగదు పంపిణీ ఆరోగ్య పరిరక్షణకు వైద్య పరీక్షలు నిర్వ హిస్తుందని వివరించారు.









బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న లీలావతి

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి 'శివశక్తి' సాయం

ప్రజాశక్తి-వినుకొండ

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి శివశక్తి ఫౌండేషన్ ద్వారా తక్షణసాయం అందించి ఆదుకున్నారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నిత్యవసరాలు, నగదు సహాయాన్ని బాధితులకు అందజేశారు. వివరాల్లోకి వెళితే వినుకొండ శ్రీనివాసనగర్‌లో కాలం శ్రీనివాసరావు ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించడంతో ఇంట్లోని వస్తు సామగ్రి మొత్తం కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భార్య, శివశక్తి ఫౌండేషన్ ఛైర్మన్ లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా బాధితుడికి బియ్యం, నిత్యావసర సరకులు, వంట సామాగ్రి, రూ.5 వేల నగదు సాయం అందజేశారు. విద్యార్థులకు ఉపకారవేతనాలు, వృద్ధులకు సాయం, మహిళలకు స్వయం ఉపాధి సహా కష్టంలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యంగా ప్రారంభం నుంచీ పనిచేస్తున్నామని, త్వరలోనే ట్రస్ట్ కార్యకలాపాలు మరింత విస్తృతం చేస్తామని చెప్పారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రామారావు

పచ్చి రొట్ట ఎరువులతో నేలలు సారవంతం

ప్రజాశక్తి-ఈపూరు

పచ్చిరొట్ట ఎరువుల సాగుతో నేలలు సారవంతమవుతాయని ఏవో ఆర్ రామారావు అన్నారు.మండలంలోని గుండేపల్లి,వనికుంట గ్రామాలలో కౌలుదారులకు పంట సాగు హక్కు పత్రం- ప్రయోజనాలపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. పొలం కౌలుకు తీసుకొని సాగు చేసే రైతులు తప్పనిసరిగా కౌలు రైతు కార్డును పొందాలన్నారు. కౌలు రైతు కార్డు వలన సాగుచేసిన పంటకు ప్రకతి వైపరీత్యాల వలన నష్టం వాటిల్లితే ప్రభుత్వం ద్వారా లభించే ప్రయోజనాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి బి.అప్పారావు,గుండెపల్లి సర్పంచ్ కె.మల్లికార్జున్, వనికుంట సర్పంచ్ బి.వెంకటసుబ్బయ్య, వీఆర్వో లు నాసర్ సాహెబ్, వెంకటేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఆనంద్ బాబు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత సేవ చేస్తాం

ప్రజాశక్తి-పెదకూరపాడు

ప్రజలకు మరింత బాధ్యతగా సేవ చేస్తామని గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ పెద్దకూరపాడు మండల కన్వీనర్ చిక్కాల ప్రకాష్‌రావు అన్నారు. గ్రేడు 5 పంచాయితి కార్యదర్శులకు డిడిఒగా ఇవ్వటం సంతోషమన్నారు. పంచాయతిరాజ్ వ్యవస్థను మరింత అభివృద్ధి పథంలో కృషి చేస్తామని హామీ ఇస్తున్నామన్నారు. యూనియన్ తరపున ప్రకాష్ రావు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

గుంటూరు ఛానల్ సమస్య పరిష్కరించండి

ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులకు వినతిపత్రం ఇచ్చిన నల్లమడ రైతు సంఘం నాయకులు


ఎమ్మెల్యే రామాంజనేయులకు వివరాలు తెలుపుతున్న కొల్లా రాజమోహన్ రావు

ప్రజాశక్తి - పెదనందిపాడు

గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగించాలని కోరుతూ సుదీర్ఘకాలంగా ఈ ప్రాంత రైతులు, ప్రజలు ఆందోళన చేస్తున్నారని ఈ సమస్యను పరిష్కరించాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు కోరారు. సోమవారం ప్రత్తిపాడు శాసనసభ్యులు బి రామాంజనేయులను గుంటూరు లోని వారి నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. రాజమోహన్ రావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం రైతుల ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలను గత వైసిపి ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా అణిచి వేసిందని తెలిపారు. 2023 జూన్ 28 నుండి గుంటూరు జిల్లా కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా 20 రోజులు వందల మంది రైతులతో నిరసన వ్యక్తం చేశామని, 21 రోజున పోలీసులు దీక్షా శిబిరాన్ని ఆక్రమించి భగ్నం చేశారని తెలిపారు. రైతులపై లాఠీ చార్జి చేశారన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిని కలవడానికి వెళుతున్న రైతులను ఐదో మైలు వద్ద అడ్డగించి, మహిళా రైతులని చూడకుండా విచక్షణ రహితంగా ప్రవర్తించారని , 29 మంది రైతులపై అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. అందులో 16 మంది మహిళ రైతులు ఉన్నారన్నారు. వారిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసేలా చూడాలని ఎమ్మెల్యేని కోరారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా గుంటూరు ఛానల్ పొడిగింపునకు హామీ ఇచ్చి ఉన్నారని, వెంటనే నిధులు కేటాయించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా నల్లమడ వాగు వరద ముంపునకు గురవుతుందని, ఈ ప్రాంతానికి శాశ్వత వరద నివారణకోసం ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే రామాంజనేయులు స్పందిస్తూ 2019వ సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగింపు కొరకు నిధులు కేటాయింపు చేసిందని, కానీ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం ఆ పనులను పక్కన పడి వేసిందన్నారు. బడ్జెట్లో భూసేకరణకు అవసరమైన రూ.109 కోట్లను మంజూరు అయ్యేలా చూస్తామన్నారు. నల్లమడ వాగు ఆధునీకరణకు, వరద ముంపు నివారణకు గత తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.326 కోట్లు కేటాయింపులు జరిగినాయని, వాటి గురించి చిలకలూరిపేట, బాపట్ల ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రికి నివేదించి సమస్య పరిష్కారం అయ్యేటట్లు చూస్తామని తెలిపారు. అలాగే అక్రమ కేసుల విషయం కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళతామని అన్నారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రామన్, బండి నాగేశ్వరరావు, రావి శివరామ కృష్ణయ్య, కొల్లా నిర్మల, దివ్వి నాగరాజు, మువ్వా పెద్దన్న, లావు చౌడేశ్వరి, నిమ్మగడ్డ గోపీనాథ్, కొల్లా వీరప్రసాద్, జాస్తి వీరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

మాతృమరణాలపై డిఎంహెచ్ఒ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలంలో సోమవారం డిఎంహెచ్ఒ డాక్టర్ కె.విజయలక్ష్మి అధ్యక్షతన సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ మెటర్నల్ డెత్ రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మే నెలలో సంభవించిన మున్నంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, కొల్లిపర సచివాలయం పరిధిలోని మాతృమరణానికి గల కారణాలపై కమిటీ సమీక్షించింది. ఇది నివారించదగ్గ మరణమే అని కమిటీ నిర్ధారించింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణీలను నమోదు చేసినప్పటి నుండి ఆశ, ఆరోగ్య కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి గర్భిణీని సూపర్‌వైజర్‌కు ట్యాగ్ చేయాలన్నారు. గర్భస్థ దశలో వైద్యాధికారి దగ్గరకు పరీక్షలకు తీసుకెళ్లాలన్నారు. అన్ని దశలలో పర్యవేక్షణ సక్రమంగా జరిగితే మాతృమరణాలు నివారించొచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ ఆదిత్య ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ రాధికరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఏవీ సుబ్బారావు స్మారక పురస్కార ప్రదానోత్సవం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారులు, ఆంధ్ర గాన కోకిల ఏవి సుబ్బారావు స్మారక పురస్కార ప్రధాన ఉత్సవం జూలై ఒకటిన నిర్వహిస్తున్నట్లు ఆయన కుమారులు ఆరాధ్యుల వెంకటేశ్వరరావు తెలిపారు. పూర్ణ శ్రీ నాట్య కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి నిర్వహిస్తున్న ట్లు చెప్పారు. కార్యక్రమం వివరాలతో కూడిన గోడ ప్రతిని స్థానిక శివాజీ చౌక్ లోని కార్యాలయంలో ఆవిష్కరించిన అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన తండ్రి ఏవి సుబ్బారావు పేరిట ప్రతి ఏటా అందించే పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ రంగస్థలం సంగీత దర్శకులు చింతలపూడి చెంచయ్యకు ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా రంగస్థల కళాకారులకు సంగీత దర్శకులుగా చెంచయ్య పని చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం రెండు గంటలకు పూర్ణ శ్రీ నాట్య కళా సమితి పద్య నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. శ్రీరామాంజనేయ యుద్ధం(యుద్ధ సన్నివేశం), పాండవోద్యోగం(కర్ణ సందేశం), గయోపాఖ్యానం(యుద్ధ సన్నివేశం), చింతామణి(ప్రేమ సన్నివేశం) ప్రదర్శన ఉంటుందన్నారు. సాయంత్రం ఐదు గంటలకు సభా కార్యక్రమంలో వర్ల రామయ్య, కళా రత్న గుమ్మడి గోపాలకష్ణ, కళా గంగోత్రి నాయుడు గోపి, నెల్లూరు అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్ పాల్గొంటారన్నారు. సమావేశంలో ఆరాధ్య ఆదినారాయణ, ఎ నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖలో అక్రమాలను వెలికి తీస్తాం : ఎమ్మెల్యే నరేంద్ర



ప్రజాశక్తి - పొన్నూరు :పొన్నూరు నియోజకవర్గంలో గత ఐదు సంవత్సరాలలో ప్రభుత్వ శాఖలో పేరుకుపోయిన అవినీతి అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. 2019 నుండి 2014 వరకు చేసిన అభివృద్ధి పనులపై సమగ్ర దర్యాప్తు జరిపించి అవకతవకలపై ప్రభుత్వపరంగా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ఐదు సంవత్సరాల్లో పురపాలక సంఘంలో ఇష్టారాజ్యంగా అభివృద్ధి పనులు చేసి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. గత ఐదేళ్లగా పొన్నూరు అవినీతి, అక్రమాలకు, అరాచకాలకు అడ్డాగా మారిందని, ప్రజాధనం పెద్ద ఎత్తున వృధా అయ్యిందని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు జవాబుదారితనంగా వ్యవహరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ చేసే బాధ్యత తీసుకోవాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు.మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మున్సిపల్, సచివాలయం సిబ్బంది పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అవినీతిమయంగా మారిందని, సంబంధిత సిబ్బందిపై ప్రజలు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇకముందు అవినీతికి పాల్పడితే సహించేది లేదని చెప్పారు. మురుగు నీటి కాలువల నిర్వహణ మెరుగుపడాలని ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణానికి మూడు వైపులా తుంగభద్ర మురుగు కాలువలు ఉన్నప్పటికీ పట్టణంలోని మురుగు కాలువలు అనుసం ధానం చేయడంలో ఇంజనీరింగ్ సిబ్బంది విఫలమ య్యారన్నారు. గ్రీవెన్సులో వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సిఎంఈ నయీమ్ అహ్మద్, మున్సిపల్ డి ఈ ఏడుకొండలు, హౌసింగ్ డి ఈ మోహన్ రావు, టి పి ఓ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖలో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని పరిషత్, రెవెన్యూశాఖ ఇతర శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశించారు. ఎన్నికల ముందు హడా విడిగా సచివాలయల్లో చేసిన రిజిస్ట్రేషన్ వివరాలు సపరేట్ గా నివేదిక ఇవ్వాలని తహసిల్దార్ ను ఆదేశించారు.


మంగళగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - మంగళగిరి

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు, దోమల నిర్మూలించాలని సోమవారం మంగళగిరి సబ్ మలేరియా డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అంగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి నుండి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, మెయిన్ బజార్, గౌతమ్ బుద్ధ రోడ్డు మీదగా అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి టిఎంకె సుబ్బరామాణం మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి రాజు నాయక్, మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు స్నేహ రాజు, గీత పద్మజ, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఏ శ్రీమన్నారాయణ, సుధీర్, సూపర్వైజర్లు సాగర్, ఏ శ్రీనివాస్ మూర్తి, నిర్మల ఫార్మసీ కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొండవీడుకోట పర్యటనకు ఎన్‌సిసి క్యాడెట్లు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ (ఇ.బి.ఎస్.బి) క్యాంప్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ లకు చెందిన ఎన్ సిసి క్యాడెట్‌లు చారిత్రాత్మకమైన కొండవీడు కోటకు సోమవారం స్థానిక వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనిర్శిటీ నుండి ప్రత్యేక బస్సులలో బయలు దేరినట్లు క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్ఎం చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. కెఎల్ యులో నిర్వహిస్తున్న ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ అనే కార్యక్రమంలో భాగంగా దేశంలోని ఆయ ప్రాంతాలకు చెందిన ఎన్ సిసి క్యాడెట్లు పాల్గొంటున్నారని అన్నారు. విశాఖపట్నం, కాకినాడ, కర్నూలు, తిరుపతి



గ్రూపులు, రాజస్థాన్ డైరెక్టరేట్‌లోని జోధ్‌పూర్, ఉదయ్‌పూర్ గ్రూపులకు చెందిన క్యాడెట్‌లతో పాటు ఎ.పి, తెలంగాణ ఎన్ సి సి డైరెక్టరేట్ ల నుండి మొత్తం 593 మంది ఈ కార్యకర్మంలో పాల్గొని భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన యువతలో జాతీయ సమైక్యత మరియు పరస్పర అవగాహనను పెంపొందించడం ఈ శిబిరం లక్ష్యమని పేర్కొన్నారు. కొండవీడు కోటలో ఎన్ సిసి క్యాడెట్లు శిక్షణ పొందిన బోధకుల పర్యవేక్షణలో, క్యాడెట్లు రాక్ క్లైంబింగ్, రాపెల్లింగ్ మరియు ట్రెక్కింగ్‌తో సహ అనేక రకాల సాహస కార్యక్ర`మాలలో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ సిఎస్ సిద్ధు, డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌విఎస్ సుదర్శన్, కెఎల్ యు వైస్ చాన్సు లర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో విసిలు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, ఎన్ వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ పావని తదితరులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' పై అవగాహన

ప్రజాశక్తి - చేబ్రోలు

నూతన విద్యా సంవత్సరం పాఠశాలలో వంద శాతం విద్యార్థుల నమోదు చేయుటం లో భాగంగా నేను బడికి పోతా, విద్యా ప్రవేశం కార్యక్రమాల పై అవగాహన సదస్సును మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె జ్యోతి మాట్లాడుతూ నూరు శాతం అక్షరాస్యత సాధించటంలో ప్రభుత్వ ఉద్యోగులమైన మన బాధ్యత కీలకమని అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో బడి బయట పిల్లలను పాఠశాలలు చేర్చే బాధ్యత మన అందరిదీ అని పేర్కొన్నారు. జూన్ 24 నుండి జూలై 25 వరకు జరిగే విద్యా ప్రవేశం


మాట్లాడుతున్న కె జ్యోతి

కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 100 శాతం సాధించేందుకు అన్ని ప్రభుత్వ అభివృద్ధి శాఖలు సమన్వయంతో ప్రత్యేకంగా ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు ఆర్థికకంగా రూ.15000 ప్రోత్సాహం అందించడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలో ప్రతి విద్యార్థికి వారంలో ఐదు రోజులు కోడిగుడ్లు, ఒక వారం రాగిజావ ఒకవారం చెక్కి ఇచ్చి అన్ని రకాల పోషకాలతో సంపూర్ణ మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పలు కారణాలతో బాల కార్మికులుగా మారకుండా బడిలో చేర్పించాల్సిన బాధ్యత మనదే అన్నారు. మండల విద్యాశాఖ అధికారి – 2 ఆర్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రైవేటు రంగ పాఠశాలల వైపు ఆకర్షితులవుతున్న తల్లిదండ్రులకు ప్రైవేటు కార్పోరేట్ స్థాయికి దీటుగా ప్రభుత్వ పాఠశాలలో వసతులు ఉన్నాయని అవగాహన కల్పించాలని అన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో మండల, గ్రామ హ్యాబిటిషన్ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామంలో సర్పంచి ఆధ్వర్యంలో కార్య క్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.కార్యక్రమంలో ఈఓపిఆర్ అండ్ ఆర్‌డి జి శ్రీనివాసరావు ఏపిఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన తాడిశెట్టి మురళి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు మంత్రి నారా లోకేష్ గ్యారంటీ అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి తాడిశెట్టి మురళి మోహన్ అన్నారు.సోమవారం రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, శాఖల మంత్రిగా నారా లోకేష్ పదవి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సచివాలయంలో తాడిశెట్టి మురళి మోహన్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛమ్ ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విలేక రులతో మురళి మోహన్ మాట్లాడుతూ రాష్ట్రం అభివద్ధిలో శరవేగంగా పరుగులు పెడుతుందన్నారు. గత ప్రభుత్వం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.

విజ్ఞాన్స్ విద్యార్థినికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగం విద్యార్థిని టి.నాగమల్లేశ్వరికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందిం చిందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ సోమవారం తెలిపారు. నాగమల్లేశ్వరి డోపింగ్ ఇండ్యూస్డ్ మోడిఫికేషన్ ఇన్ ఎన్నీల్డ్ జింక్ ఆక్సైడ్ నానోస్ట్రక్చర్స్: ఏ మల్టిఫేసిటెడ్ స్టడీ ఆన్ స్ట్రక్చరల్, ఆప్టికల్, మ్యాగ్నటిక్ అండ్ మెకానికల్ ప్రాపర్టీస్' అనే అంశంపై పరిశోధన చేసిందని, ఆమెకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ జాలాది నిశ్చల్ కిరణ్ గైడ్‌గా వ్యవహరించారని తెలిపారు. డాక్టరేట్ పొందిన టి.నాగమల్లేశ్వరిని విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వీసీ ప్రొఫెసర్ నాగభూషణం అధ్యాపకులు అభినందించారు.



నాగమల్లేశ్వరిని అభినందిస్తున్న లావు రత్తయ్య తదితరులు

గ్రీవెన్స్ పున:ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో అధికారులు నిర్వహిస్తున్న గ్రీవెన్స్ పున:ప్రారంభం అయ్యింది. ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుండి నూతన ప్రభుత్వం అధికారం చేపట్టే వరకూ గ్రీవెన్స్ నిలిచిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ జి.రాజకుమారి, ఇతర అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం 120 అర్జీలు అందాయి. కాగా జిల్లా అధికారులు కాకుండా వారి స్థానంలో గ్రీవెన్స్‌కు హాజరైన పలువురిని ఇన్‌చార్జి కలెక్టర్ బయటకు పంపించారు. గ్రీవెన్స్‌కు హాజరు కాలేకపోతే ముందుగా అనుమతి తీసుకోవాలని, అలా కాకుండా ద్వితీయ శ్రేణి అధికారుల్ని గ్రీవెన్స్‌కు పంపటం సరికాదని పేర్కొన్నారు. హాజరైన అధికారులను ఉద్దేశించి రాజకుమారి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా నలుమూలల నుండి జిల్లా కేంద్రానికి వచ్చి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందించిన ఫిర్యాదులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి , ఎం.గంగ రాజు, డిఆర్‌ఓ పెద్ది రోజా, ఆర్డీఓ పి. శ్రీఖర్, జెడ్పీ డిప్యూటి సిఈఓ మోహన్ రావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ రాజకుమారి

డాక్టర్ రమణ ఎస్ఎస్‌వికి ఉద్యోగోన్నతి

ఒంగోలు జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా నియామకం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి




గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రమణ ఎస్ఎస్‌విని ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ రమణకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ సూపరింటెండెంట్‌గా నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థోపెడిక్ రంగంలో డాక్టర్ రమణకు అపారమైన అనుభవం ఉంది. వైద్యులుగానే కాకుండా ఆయన సాహిత్య రంగంలో కూడా ప్రావిణ్యత గడించారు. పలు సాహితీ గోష్టులతో పాల్గొనడం, పలు రచనలు చేస్తుంటారు. వైద్య రంగంలో కూడా నిజాయితీ కలిగిన వైద్యుడిగాపేరుంది.

రైతుల సమస్యలను పరిష్కరించాలని వినతి


గ్రీవెన్స్‌లో వినతి పత్రం ఇచ్చిన రైతు సంఘం నాయకులు జొన్నా శివశంకరావు, అజయ్‌కుమార్, సాంబిరెడ్డి తదితరులు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినందున రైతుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.20వేలు వెంటనే రైతులకు అందిస్తే పెట్టుబడికి ఉపయోగపడతాయన్నారు. గతేడాది తుపాను, అధిక వర్షాలకు పంటలకు రైతులందరికీ ఇవ్వాల్సిన పరిహారంతోపాటు, సున్నావడ్డీ, పావలావడ్డీలు వెంటనే చెల్లించాలన్నారు. రైతు భరోసా కేంద్రాలను రైతులకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని, వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు ఏర్పాటుకు తీసుకొచ్చిన జిఒ 22ను రద్దు చేయాలని, పంటకాల్వల్లో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపుడెక్క, పూడికతీత వెంటనే తొలగించాలని, పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్‌పై నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తిచేసి వేలాది ఎకరాలకు నీరందించేలా చూడాలని, కొండవీటి వాగు ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలని, తెనాలి డెల్టా ప్రాంతంలోని కాల్వలను ఆధునీకరించాలని, పంటల బీమా పథకాన్ని ప్రభుత్వమే చేపట్టాలని, దుగ్గిరాల కోల్డ్ స్టోరేజి అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తదితర సమస్యలపై అర్జీ అందచేశారు. కార్యక్రమంలో కంచుమాటి అజయ్‌కుమార్, తుమ్మా ప్రసాదరెడ్డి, జొన్నా శివశంకర్ ఆళ్ల సాంబిరెడ్డి, కె.రామస్వామి, జి.నాగేశ్వరరావు, ములకా శివసాంబిరెడ్డి, వి.వెంకటరామయ్య, కొండాలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందచేస్తున్న బొమ్మిడాల భానుమూర్తి

గేట్ రెండో ర్యాంకర్ రవితేజకు రూ.లక్ష ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుంటూరు

ఎంటెక్‌లో ప్రవేశానికి నిర్వహించిన గేట్, ఇసిఇలో రెండో ర్యాంకు సాధించిన అద్దంకికి చెందిన ఘంటసాల రవితేజకు చదువు కోసం బొమ్మిడాల భానుమూర్తి ట్రస్ట్ చైర్మన్ బొమ్మిడాల భానుమూర్తి రూ.1లక్ష ఆర్థిక సాయం అందించారు. చెక్కును సోమవారం రవి తేజకు గుంటూరులో భాను మూర్తి చేతులమీదుగా అందించారు. రవితేజ ఐఐటి బొంబాయిలో ఎంటెక్ సీటు సాధించినట్లు తెలిపారు. ఈ క్యాక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షులు తటపర్తి రాంబాబు, అవోపా ట్రస్ట్ కార్యదర్శి పొట్టి శ్రీరాములు, గాంధీ క్లబ్స్ చైర్మన్ బంగారుబాబు కొలిశెట్టి సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని వినతి

రాజకీయ ఒత్తిళ్లతో బలవంతంగా రాజీనామా చేసిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పలువురు వాలంటీర్లు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. నగరంలో పలు వార్డులకు చెందిన యం.రోజా రమణి, బి.రాజేశ్వరి, బి.శిరీష, షేక్.మరియంబి తదితరులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు వాలంటీర్లుగా ప్రజలకు సేవలు అందించామని, ఎన్నికల సందర్భంలో తాము రాజీనామా చేస్తేనే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి విధుల్లో తీసుకుంటామని ఒత్తిడి చేయటంతో రాజీనామా చేయాల్సి వచ్చిందన్నారు. కావున తమ కుటుంబ పోషణను దృష్టిలో పెట్టుకొని తిరిగి వాలంటీర్‌గా కొనసాగించాలని కోరారు.


విధుల్లోకి తీసుకోవాలని వినతి పత్రం ఇచ్చిన వాలంటీర్లు

టిడ్కో గృహాల్లో సదుపాయాలు కల్పించాలి

గుంటూరులోని ఏపీ టిడ్కో గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు షేక్.మీరావలి ఆధ్వర్యంలో లబ్దిదారులు గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. గత ఆరు నెలలుగా టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్నామని, నీరు, పారిశుధ్యం, కరెంటు సమస్యలు ఉన్నాయని తెలిపారు. రెండ్రోజులకు ఒకసారి, అదికూడా గంట మాత్రమే నీరు ఇస్తున్నారని, అవి సరిపోవట్లేదన్నారు. ట్రాన్స్‌ఫారం లైన్‌లో ఇళ్ల ఎదుట చెట్లు బాగా పెరిగాయని, దీంతో విష సర్పాలు ఇళ్లలోకి వస్తున్నాయని, రెండు బైకులు కూడా పోయాయని తెలిపారు. కావున తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.



ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం)కు ప్రజల నుండి అందే ఫిర్యాదులు, ఆర్జీలను విభాగాల వారీగా విభజించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్జీలు రీఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. అవుట్‌ఫాల్ డ్రైన్, ఇంటర్నరల్ డ్రైన్లలో జరుగుతున్న పూడికతీత పనులు, నూతన కల్వర్టుల నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. నూతన కల్వర్టుల నిర్మాణాలకు రెండ్రోజుల్లో ప్రతిపాదనలు అందించాలన్నారు. వీధి దీపాలకు సంబంధించి అందే ఫిర్యాదులు 48 గంటల్లో పరిష్కరించాలన్నారు. అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగం 14, ఇంజినీరింగ్ విభాగం 16, రెవెన్యూ విభాగం 1, ప్రజారోగ్య విభాగం 11, ఉపాసెల్ 4, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 1 ఫిర్యాదు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, సిఎంఓహెచ్ డాక్టర్ డి.ఆషా, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, ఉపాసెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

మా పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ ఇవ్వరూ..



తమ పిల్లలకు గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన హైస్కూల్స్‌లో అడ్మిషన్ కల్పించాలని గుంటూరుకు చెందిన పేటేటి సుధీర్ తన పిల్లలతో కలిసి గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. తమకు కుమార్తె పి.రుద్రనేత్ర 8వ తరగతి వరకూ జలగం రామారావు హైస్కూల్లో చదివిందని, భార్య అనారోగ్యం రీతా 9వ తరగతి కడపలో చదివిందన్నారు. ఇప్పుడు పదో తరగతికి తిరిగి జలగం రామారావు హైస్కూలుకు వెళ్లగా అడ్మిషన్ లేదంటున్నారని తెలిపారు. అలాగే తమ కుమారుడు శరత్‌కుమార్ జలగం రామారావు హైస్కూల్లోనే 7వ తరగతి చదివాడని, సరిగా పాఠశాలకు వెళ్లనందున ఫెయిల్ అయ్యాడని, దీంతో మళ్లీ అదే స్కూల్లో చేర్చుకోవటానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. అడ్మిషన్ కోసం సమీపంలోని ఇతర ప్రభుత్వ హైస్కూల్స్‌లో సంప్రదించినా అడ్మిషన్లు లేవని చెబుతున్నారని, కావున తమ పిల్లలకు అడ్మిషన్ కల్పించాలని కోరారు.